## క్లుప్తంగా

### రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు



విద్యుత్ దీపకాంతుల్లో సీతారామచంద్రస్వామి ఆలయం

**బత్తలపల్లి:** గంటాపురంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లు వెచ్చించి నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. బుధవారం గ్రామపెద్దలు విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఆదివారం వరకు సాగే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు రూ.30లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని సీతారామచంద్రస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### విజయదశమి శుభాకాంక్షలు



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

**పుట్టపర్తి టౌన్:** మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దుష్ట శక్తులపై దైవ శక్తులు విజయం సాధించిన రోజును దసరా పండుగగా జరుపుకొంటామన్నారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులు, సిరిసంపదలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

### 'ఓట్ చోర్.. గద్దె చోడ్'

**ధర్మవరం:** పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకుడు తుంపర్తి పరమేష్ ఆధ్వర్యంలో 'ఓట్ చోర్ .. గద్దె చోడ్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు పోలా రామంజినేయులు, నరేంద్ర, సీపీఐ మధు, ఎస్ఎఫ్ఐ నాగార్జున, కాంగ్రెస్ నాయకులు దాదు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### వేరుశనగలో పంటకోత ప్రయోగాలు

**ముదిగుబ్బ:** మంగళమడక రెవెన్యూ పొలంలో బుధవారం అధికారులు పంటకోత ప్రయోగాలు చేశారు. ఒక పొలంలో 2.200 కిలోలు, మరొక పొలంలో 2.850 కిలోల చొప్పున దిగుబడి వచ్చినట్లు సీనియర్ స్టాటస్టికల్ అధికారి రాజేంద్రనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ మనోహర్‌నాయక్, వీఏఏ అంజిబాబు, ఎంపీఈఓ నాగరాజు, వీహెచ్ఏ ప్రత్యూష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ ఏర్పాటుకు వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

**తలుపుల:** వేపమానిపేట పంచాయతీ నుంచి గంజివారిపల్లిని విభజించించి పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేయాలని గంజివారిపల్లి, బోయపల్లి, ఎస్సీ కాలనీ, కొత్తపూలవాండ్లపల్లి, గుర్రంగుండ్లపల్లి ప్రజలు కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఎంపీడీఓ నజీమాకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత పంచాయతీ కేంద్రం వేపమానిపేటకు ఏదైనా పనిపై వెళ్లాలంటే సరైన బస్సు సౌకర్యం లేదన్నారు. గంజివారిపల్లిని పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అక్బర్, బాబు, శీనా, ముస్తఫా, వెంకటేష్, బాదుల్లా పాల్గొన్నారు.

## దసరా శోభ

**సాక్షి బృందం:** దసరా నవరాత్రులతో అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవారు బుధవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఆయుధ పూజను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. గురువారం విజయదశమి. పండుగ సందర్భంగా పట్టణ, మండల కేంద్రాల్లో పూలు, పూజా సామగ్రితో పాటు నిత్యావసర సరుకులు, వస్త్రాల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



ధర్మవరంలో కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణం



ధర్మవరంలో అర్ధనారీశ్వరిదేవి అలంకరణలో తొగటవీధి చౌడేశ్వరిదేవి



కదిరి సమీపంలోని పట్నంలో మహిషాసుర మర్దినిగా కన్యకాపరమేశ్వరి



తాడిమర్రి మండలం దాడితోటలో మహిషాసురమర్దినిగా పెద్దమ్మ తల్లి



కదిరిలో మహిషాసురమర్దిని అలంకారంలో మరకతమహాలక్ష్మి



బత్తలపల్లి కూడలిలో మహిషాసుర మర్దిని రూపంలో అమ్మవారి విగ్రహం



ముదిగుబ్బలో మహిషాసురమర్దిని అలంకరణలో వాసవీ మాత



ధర్మవరంలో కాళికాదేవి అలంకరణలో పుట్లమ్మదేవి



రామగిరి మండలం నసనకోటలో ప్రత్యేక అలంకరణలో దుర్గామాత

## ధైర్యంగా ఉండండి





అంజాద్ కుటుంబ సభ్యులను, పెదబల్లిలో ఎం.సరస్వతమ్మను పరామర్శిస్తున్న సమన్వయకర్త మక్బూల్

**కదిరి టౌన్:** అక్రమ కేసులో సోషల్ మీడియా యాక్టివిస్టు మెగా అంజాద్‌ను రిమాండ్‌కు పంపారు. పట్టణంలోని అంజాద్ కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ బుధవారం పరామర్శించారు. త్వరలోనే అంజాద్ బయటకు వస్తాడని, ధైర్యంగా ఉండాలని, కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

**కార్యకర్త కుటుంబాలకు పరామర్శ..**

**ఎన్‌పీకుంట:** మండల పరిధిలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పరామర్శించారు. బత్తినిగారిపల్లికి చెందిన సుబ్బారెడ్డి భుజానికి గాయమై హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. పెడబల్లికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు ఎం.పుల్లారెడ్డి సతీమణి ఎం.సరస్వతమ్మ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మోకాళ్లకు ఆపరేషన్ చేయించుకొని ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న సమన్వయకర్త.. పార్టీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఆయా కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎం.హరీష్‌రెడ్డి, ఎం.విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

**ధర్మవరం రూరల్:** 'జీఎస్టీ తగ్గింపు – సూపర్ సేవింగ్స్' కార్యక్రమంపై బుధవారం జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ధర్మవరంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు వ్యవసాయ రంగంలో జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలు రైతులకు ఎన్నో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ ముస్తఫా, రైతులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ:** మండలంలోని రామస్వామి తండాలో వ్యవసాయ యంత్రాలు, ఇతర వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజాలపై మండల వ్యవసాయాధికారి రవీంద్ర రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగభూషణం, మినీబాయి తదితరులు పాల్గొన్నారు.

**కొత్తచెరువు:** బండ్లపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని క్రాస్ వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' పేరుతో కార్యక్రమం నిర్వహించారు.

**ఎన్‌పీకుంట:** సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రం ఎన్‌పీకుంటలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'డిజిటల్ బుక్'తో దౌర్జన్యాలకు చెక్



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు



రామగిరిలో డిజిటల్‌బుక్ శ్రీరామరక్ష పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

**గాండ్లపెంట:** వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులకు చెక్‌పెట్టి.. భరోసా కల్పించేందుకు 'డిజిటల్ బుక్' ప్రవేశపెట్టినట్లు నాయకులు పేర్కొన్నారు. బుధవారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అధికార కూటమి నాయకుల నుంచి దాడులు, దౌర్జన్యాలకు గురైన వారు డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాతం జగన్మోహన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్ అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు సూర్యనారాయణరెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి జక్కల నరసింహాగౌడ్, మండల యూత్ కన్వీనర్ చంద్రారెడ్డి, మండల వైస్ కన్వీనర్ వైవీ శంకర్‌నాయుడు, నాయకులు పామిడి ఇక్బాల్, మాజీ డైరెక్టర్ మేకల నరసింహులు, రామాంజులరెడ్డి, గోపాల్‌నాయక్, అత్తార్ ఆసిఫ్, రామాంజులరెడ్డి, మైనుద్దీన్, శేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**రామగిరి:** వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ శ్రీరామరక్ష లాంటిదని ఆ పార్టీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, జేఎస్‌సీ కన్వీనర్ వెంకటరెడ్డి, యూత్ కన్వీనర్ మణికంఠ తెలిపారు. బుధవారం వారు రామగిరిలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'డిజిటల్ బుక్' పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారన్నారు. ముఖ్యంగా రామగిరిలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అందరం కలసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఎవరైతే మీకు అన్యాయం చేశారో వారి పేర్లను డిజిటల్ బుక్కులో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సిరెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ

**పుట్టపర్తి అర్బన్:** జిల్లా వ్యాప్తంగా బుధవారం సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య చెప్పారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతిగ్రామంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ డబ్బు అందజేశారు.



### ఘనంగా ఉరుసు మహోత్సవాలు



అలంకరణలో దర్గా

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని కొత్తపేటలో అస్తాన ఎ హజరత్ మహబూబ్ సుబహాని రహం ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని కమిటీ అధ్యక్షుడు నాసిర్ అహమ్మద్ బుధవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 3న గంధం, 4న ఉరుసు, 5న జియారత్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### 4న మండల సర్వసభ్య సమావేశం

**చెన్నేకొత్తపల్లి:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 4వ తేదీ (శనివారం) ఏర్పాటు చేసినట్లు మండలాల అభివృద్ధి అధికారి బాలకృష్ణుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అంజలి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందన్నారు. మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు, మండలంలోని అన్నిశాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, కోఆప్షన్ మెంబర్లు తప్పక హాజరుకావాలన్నారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

### ఇద్దరికి గాయాలు

**నల్లచెరువు:** మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం కదిరి వైపు వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలను మదనపల్లి నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోరంట్లవారిపల్లికి చెందిన సునీల్, అనంతపురానికి చెందిన రవీంద్ర గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడు ఆపకుండా కదిరివైపు దూసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మక్బూల్ తెలిపారు.

### రీసర్వేకు సహకరించాలి

**తాడిమర్రి:** వ్యవసాయ భూముల రీసర్వేకు సహకరించాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి రైతులకు సూచించారు. పెద్దకోట్ల గ్రామంలో బుధవారం ఆయన సచివాలయ సిబ్బందితో కలసి ర్యాలీ చేశారు. అనంతరం రైతులతో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పెద్దకోట్ల రెవెన్యూ గ్రామం పరిధిలోని పెద్దకోట్ల, గుడ్డంపల్లి, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో శుక్రవారం నుంచి భూముల రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. భూముల కచ్చితమైన కొలతల కోసం నిర్వహిస్తున్న రీసర్వేకు రైతులు సహకరించాలన్నారు. నోటీసులు తీసుకున్న రైతులు వారికి ఇచ్చిన రీ సర్వే సమయంలో దగ్గర ఉండి కొలతలు వేయించు కోవాలన్నారు.

### ఖాద్రీశుడిని దర్శించుకున్న కలెక్టర్



కలెక్టర్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ

**కదిరి టౌన్:** కలెక్టర్ శ్యాంప్రసాద్ దంపతులు బుధవారం రాత్రి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. తొలుత కలెక్టర్‌కు ఆలయ అధికారులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం కలెక్టర్‌కు ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వి.వి.ఎస్.శర్మ, డీఎస్పీ వెంకట శివనారాయణస్వామి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### పండ్లతోటలతో ఆర్థికంగా ఎదగాలి

**కదిరి అర్బన్:** రైతులు పండ్లతోటల పెంపకం ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ పోలప్ప, హార్టికల్చర్ అధికారి ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. వీరేపల్లిలో రైతు ప్రతాప్‌రెడ్డి పొలంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన 150 మామిడి మొక్కలను వారు బుధవారం నాటారు. ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.